# వెన్నెల పాటల్లో

వెన్నెల. వెన్నెల.

మనసిచ్చిన చిన్నదాని నవ్వులాంటి వెన్నెల.

మొగలి తరకలాంటి, సబ్బు నురగ లాంటి వెన్నెల.

ఆ వెన్నెల్లో ఊరు తలంటుకుంటూంది.

ఊళ్ళోని నిద్దని కాపలా కాస్తున్న విద్యుద్దీపాలు, సిగరెట్లు కాలుస్తున్న సెంట్రీల్లా ఉన్నాయి.

వాటికి దూరంగా, ముక్కుకి సూటిగా పోయే వాడి మనస్తత్వంలా ఉన్న రోడ్డు మీద, తెల్లని వరదా పరిచినట్లుంది వెన్నెల.

ఏ భయానికి, ఆకర్షణకి లొంగని ఆత్మ నిగ్రహంతో, సత్యాగ్రహ యోధుడిలా శాంతంగా నిలుచున్న చెట్లమీద తెల్లని టోపీ లాంటి వెన్నెల.

గ్రీన్ రివల్యూషన్‌కి మచ్చుతునకల్లా ఉన్న పొలాల మీద వెన్నెల.

మొత్తంమీద ప్రకృతి కాంత మల్లె తొడుగు తొడుక్కున్నట్లుంది.

పాల సముద్రంలా ఉన్న ఆ వెన్నెల దారిలో, పువ్వుల పడవలో పోతున్నట్లు, ఆ రోడ్డుమీద సైకిల్‌పై సాగిపోతున్నది ఓ జంట.

ఆడ, మగ.

సైకిల్ తొక్కుతున్న సూరీడు కళ్ళలో అలుపు లేదు.

ముందు కూర్చున్న, బంగారం కళ్ళలో మాత్రం వెన్నెలను వెక్కిరించే మెరుపుంది.

బంగారం, బంగారంలా ఉండదు.

బంగారం అంటే ఆశ లేదు.

కాని బంగారం లాంటి సూరీడంటే మాత్రం, తన ఒంటిమీదున్న, బంగారం కూడా ఇచ్చేస్తుంది. కాని ఆవిడ ఒంటి మీద నలుసంతైనా బంగారం లేదు.

బంగారం లాంటి మనసున్న బంగారమ్మ ఇంకెప్పుడూ తన స్వంతమే అన్న ఊహ, సూరీడుకు బోలెడంత బలమిచ్చింది.

ఆ రోజు ఉదయమే, వాళ్ళ పెళ్ళికి నిశ్చితార్థం జరిగింది.

విడుస్తున్న ఊపిరికన్నా వేగంగా, సైకిలు పోనిస్తున్న సూరీడు ఆనందానికి కారణం అదొక్కటే కాదు.

తెల్లారితే ఉద్యోగం.

ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్న ఉద్యోగం.

ఎప్పటికీ రాదనుకున్న ఉద్యోగం.

బంగారం తన జీవితంలోకి ప్రవేశించడం వల్ల ఉద్యోగం వస్తుందో, లేక ఉద్యోగం రాబోవడం చేత బంగారం దక్కిందో, వా డిప్పటికీ తేల్చుకోలేని సమస్య.

వాళ్ళు ఉన్న ప్రదేశానికి, అరుణా జూట్ మిల్లు అరమైలు వెనకబడి ఉంది. వాళ్ళ ఊరు ఇంకా ఆరుమైళ్ళు ముందుంది. అందరితోపాటు, మొదటాట అయిపోగానే బయలుదేరి ఉంటే, ఏ రెండు మైళ్ళ దూరంలోనో ఉండేది.

'సైకిల్ రాజా — కవాలి రాణి' సినిమా వాళ్ళు చూపి సుమారు రెండు గంట లయింది. అందులోని కొన్ని సీన్లు మాత్రం, వాళ్ళ కళ్ళముందు కనీసం రెండు రోజుల వరకైనా మెదులుతాయి.

గంట క్రితం గంటస్తంభం దగ్గర, బంగారం కొప్పులో తురుముకున్న మల్లెపూల వాసన తెల్లారే వరకైనా ఉంటుంది.

* * *

"ఛఛ! ఏదవ బతుకు!" గొణగలేదు మస్తాను.

గట్టిగానే అన్నాడు.

అలా అతడు అప్పటికి ఎన్ని సార్లు అన్నాడో లెక్కపెట్ట లేదు వీరాస్వామి.

"ఆడికి ఉచ్చం నీచం ఉన్నాయా?" మస్తాను మనసులో ఉన్న అనుమానానికి మళ్ళీ మాట లొచ్చాయి.

ఎవరికి అని అడక్కుండానే "నీవు" అన్నాడు వీరాస్వామి, నిబ్బరంగా. ప్రపంచంలో ఎవరికీ కూడా, నీతి నియమం ఉచ్చం నీచం ఉంటాయని, వీరాస్వామికి అనుమానం లేదు. ఉండాలనే అభిప్రాయం ఆవలే లేదు.

"బీటు జవానుగా సేరి, సర్కిలయ్యంటే తెలిసొచ్చేది బాబుకి. మంగళారం రైడు కెళదామన్నాడా? లేదా? మరీవాళే ఎళదామంటా డేటి?" మస్తాను రిజనింగు.

"ఆడంతేలే. మిలట్రీలో ఉండాల్సినోడు, మన నెత్తిమీదికి డైరెక్టుగా దిగబడ్డాడు. ఏటి సేస్తాం? అనుభవించడమే" అన్నాడు వీరాస్వామి.

ఆ రోడ్డు మీద కోడు గుర్రాల్లా సాగిపోతున్నాయి సైకిళ్ళు.

గుర్రాల మీద సైనికుల్లా, సైకిళ్ళ మీద జవాన్లు సాగిపోతున్నారు.

"మనమీ అర్ధరాత్రి కబురందించుండక పోతే ఏట వుద్దంటావా?"

"ఏటవుద్దా? ఏటీ అవదు. దేశంలో పారా బట్టే లెండిపోవు. ముక్కు దొరక్కెవడూ సచ్చిపోడు. కాకపోతే ఈ పాటికి మన జేబులో ఈ నాలుగు డబ్బులూ ఆడకపోను, అప్పుడు నీ నోరిలా ఆడకపోను" అన్నాడు వీరాస్వామి.

వీరాస్వామిని కదిలిస్తే, ఉపన్యాసాలిస్తాడని తెలుసు మస్తానుకి. కాని ఇప్పుడతను అంత చికాగ్గా ఎందుకున్నాడో మాత్రమే తెలియదు. అందుకే —

"ఛస్! అది కాదురా. గళాశ్ గంగమ్మ పని ఖాళీ యేనా? దానికి మూన్నెళ్ళ మీద పడునా?" అన్నాడు.

నిన్ననే రిక్రూట్ అయిన వాణ్ణి చూసినట్లు చూసి, "పడదు. ఫైను కట్టేస్తుంది. లేకపోతే కట్టించేస్తుంది. అది జైలు కెళితే, ఆ ఊరు కరణానికి కరచరణా-లాడవు. దానికి జామీ నివ్వడానికి, మేస్త్రీ నోటే ముందుకొస్తాడు. తల్చుకుంటే జడ్జినే కొనేస్తుందది" అన్నాడు వీరాస్వామి.

గళాశ్, గంగమ్మ ఇంటిపేరు కాదు. గళాశ్ వల్ల గంగమ్మకి పేరొచ్చిందో, లేక గంగమ్మవల్ల గళాశ్‌కి ప్రాముఖ్యం వచ్చిందో చెప్పలేం కాని, గళాశ్ పుచ్చుకునే ముందు గళాశ్ గొప్పదని, పుచ్చుకున్నాక గంగమ్మ అంతకన్నా మహిమ గలదని అంటూ ఉంటా రందరూ.

సడన్‌గా సైకిల్ దిగేడు మస్తాను. స్టాండు వేసి చెట్ల వైపు నడిచేడు.

"ఏంటైంది?" అంది వీరాస్వామి అతి నిత్యపు అనుమానపు గొంతు.

"ఏటోన్లేదు. నువ్వు లాగించు."

అర్థమైంది వీరాస్వామికి తుప్పాను అవసరం.

తంతకన్న ఎక్కువగానే ఉంది తన నరాల పొంగు అనుకుంటూ సైకిలు మెల్లిగా ముందుకు పోనిస్తున్నాడు వీరాస్వామి.

అంతలో ఎదురుగా —

పటాన్ టాంకుల మీద పాకిస్తాన్ సైనికుల్ని చూసినట్లు తుళుక్కుపడ్డాడు.

దెయ్యాలు వెన్నెల విహారం చేస్తున్నాయా? ఇది విజయనగరం — కోరుకొండ రోడ్డేనా? లేక స్పెషల్ మేట్నీలో తను చూసిన హాలీవుడ్ లాండా?



గుంటూరు మెడికల్ కాలేజీలో తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞత తెలుపుతున్న శ్రీ నేరెళ్ల వేణుమాధవ్, ఎమ్ ఎల్ సి.

అని ఆశ్చర్యపోయి, ఆ తరవాత అవేమీ కావని గ్రహించి, ఆ క్షణంలో తన నెత్తి మీద టోపీ భరించలేని భారంగా తోచి, "ఆగండి" అన్నాడు సౌమ్యమైనంత గట్టిగా.



విజయా రఘురామ్

ఆ కంఠస్వరంలోని కోపం జీరకన్నా, ఆ వెన్నెల్లో టోపీ ఎరుపునే గుర్తించిన, బంగారం కళ్లలోని వెన్నెల వెలుగు షేడయి పోయింది.

"మావా! పోలీసు! !"

"మావా! రౌడీ రంగడు, భూతం, దెయ్యం, మనూరి మున్సబు — కాదు కాదు, వాళ్లందరూ!" అలా ఏమన్నా సూరీడు అంతగా భయపడిఉండేవాడు కాడు.

ఎలా? ఎలా?

వేగంగా, ఇంకా వేగంగా,

జోరుగా, ఇంకా జోరుగా,

సైకిలు తొక్కాలనుకున్నాడు. తొక్కుతున్నా ననుకున్నాడు.

కాని లేదు.

సైకిలుమీద కాక గాలిమీద తేలి పోతున్నట్లున్న వాళ్లిద్దరూ రెండు క్షణాల్లోనలే, కంకర రోడ్డు మీద నిలుచున్నారు.

ఆ కంకర రోడ్డు, కంకర రోడ్డులా కాక, ఎండకి కరిగిపోయిన తారు రోడ్డులాగాను, నరకంలో మెయిను రోడ్డు లాగాను అనిపించింది వాళ్ల కాళ్లకి.

హేండిల్ బారుమీద చెయ్యి వేసి నిలుచున్న పోలీసు, పోలీసులా కాక, పెద్ద సర్పంలా కనపడ్డాడు వాళ్ల కళ్లకి.

"మీరా బాబూ? సూణ్నేదు. సూస్తే దిగిపోమా?" సూరీడు కాళ్లలో మొదలయిన వణుకు, గొంతులోంచి బయటి కొచ్చింది.

"అవున్నేనే, సూళ్లేదూ? రేపీక లేటి? నీ కనబడ్డానికి తెల్ల ముసుగేసుకుని రోడ్డు కడ్డం నిలబడమంటావేటి? అయినా మీరేటి ఈరో ఈరోయిన్లనుకున్నారా? రాజా రాణీ అనుకున్నారా! ఇది నీ కీలుగుర్ర వేటి? దానికి బ్రేకు లున్నాయా? ఇంతకీ లైటేది?"

ఆ ప్రశ్నలు, ప్రశ్నల్లా కాక, పెద్ద పులి గర్జనల్లా వినిపించేయి వాళ్లకి.

"ఎలిగించేను బాబూ, ఆరిపోయుంటాది."

"అదెందుకు ఆరిపోవాలి? ఆర్పి అక్క మంటావు.

అవున్లే లేటే లైటులా వెలిగి తున్న ఆడదాన్ని ముందెట్టుకున్నావుగా!" వీరాస్వామి అధికారం, దర్పం, పూర్తి ప్రాతేయత మీద స్వారీ చేస్తున్నాయి.

నెమ్మదిగా వాళ్లదగ్గరి కొచ్చిన మస్తాను పరిస్థితిని అర్థం చేసుకున్నాడు.

"ఏ ఊరు? ఎట్నుంచొస్తున్నారు?" అని ప్రశ్నించేడు.

"నాగారం బాబూ, విజయ నగరంలోసినిమా సూస్తున్నాం, బాబూ. మా వాళ్లు ముందెల్లిపోయేరు" అన్నాడు సూరీడు.

"ఒరే ఈ ఏషాలు నా దగ్గరకావు. తిప్పండి సైకిలు, పదండి స్టేషనుకి. అక్కడ చెబుదురుగాని హరికథ. ఊ!"

ఆర్డరు జారీ చేశాడు మస్తాను.

చటుక్కున జ్ఞాపకం వచ్చింది సూరీడుకి — తెల్లారితే తను ఉద్యోగంలో చేరవలసిన సంగతి. ఆ అవకాశాన్ని వదిలేస్తే దాన్ని తన్నుకుపోవడానికి సిద్ధంగా ఉన్న వాళ్ల సంగతి.

"ఈ చిటం ఒగ్గెండి బాబూ. తెల్లారితే పన్లో చేరాల" అన్నాడు.

"ఏటా మాకేటి డ్యూటీల్లేవు? అర్ధరాత్రి నిద్ర పీకుల్లా ఈ రోడ్ల మీద ఎందుకు దేవులాడుతున్నా మనుకున్నావు? మీలాంటోళ్ల కోసమే" అన్నాడు వీరాస్వామి.

సినిమా చూడగా మిగిలిన డబ్బుతో మొదటిసారి జంటగా 'ముతతి కౌఫీ' తో విందారగించిన సూరీడుకి, వీరాస్వామి కాళ్లు పట్టుకోవడం తప్ప, మార్గాంతరం కనిపించలేదు.

"ఛ ఛ. కాళ్లగ్గి! నువ్వట్టు కుంటే ఏటి రాత్రాది బాబోయ్" అంటున్న వీరాస్వామి కళ్ళు బంగారం వైపు తిరిగేయి.

అంతే.

అతని నోరు పడిపోయింది. కళ్ళు, బంగారాన్ని ఎక్సరే తియ్యడం ప్రారంభించేయి. ఆమెలో, వణుకు, భయంతో పాటు ఇంకేదో, తనకా క్షణంలో కావలిసిందేదో కనిపించింది అతనికి.

"సైకిల్ నీదేనా?" ప్రశ్నించింది మస్తాను.

"కాదు బాబూ మా ఊరి అప్పుడు దొరది." సూరీడు నిజం చెప్పేడు.

"పోనీ, ఇది నీ పెళ్ళామేనా?"

"కాదు బాబూ ... అవునవును. ఇవాళే నిచ్చితార్థం అయింది."

"నిశ్చితార్థమా? నెగ దీసుకు పోవడానికి ముహూర్తమా?

విశ్వక డియెస్పీ బాబేనా కాయలే డోరే. డబుల్స్, లైటునేదు, సైకిలు నే దికాదు. అయినా కంపెనీ గుంటని సైకి లెక్కించుకుని ఊర్నంట తిప్పి వాణ్ణి నిన్నే సూసేను'' అన్నాడు మస్తాను.

''కంపెనేటి బాబూ?'' మారీదు అమాయకత.

''అవున్లే. పేర్నతో పనేటి? సరుగ్గావాలి గాని.''

మంత్రాల్లాంటి మస్తాను మాటలు వీరాసామి నోట కట్లు విప్పేశాయి. స్టేషనుకు రాలేని వాళ్లని, ఎక్కడి కక్కడ ఎలా శిక్షించాలో అతనికి బాగా తెలుసు.

వీరాస్వామి చేయి బంగారం వైపు వెళ్లింది.

దెయ్యాల రావిచెట్టు మీంచి, అయిదు తలల నాగుపాము తనవైపు వస్తున్నట్లు అనిపించిన బంగారం ఒక్కడుగు వెనక్కి వేసింది.

వీరాస్వామి రెండడుగులు ముందుకు వేసేడు.

ఆ అడుగు మధ్య బంగారం దైన్యం, మారీదు అసహాయత ఉన్నాయి. ఆ అడుగు వెయ్యడానికి బలం వీరాసామికి తలపై టోపీ, కట్టుకున్న బట్టలు, నరాల్లో ఆకలి, ఆ నిర్జన ప్రదేశం ఇచ్చేయి.

జూదంలో ఓడిపోయిన ధర్మరాజులా నిలుచున్న మారీదుకి భీమసేనుడుగా మారిపోదా మనిపించింది.

చటుక్కున వంగి చేతికందిన రాయి పట్టుకుని ఎదురుగా ఉన్న చెట్టువైపు దూకేడు.

అంతే.

విలాసంగా మస్తాను చేతిలో ఊగుతున్న లాటీ మారీదు పిల మండ మీదికి విసురుగా వెళ్లింది. తరవాత ఒళ్లంతా విసిరింది.

మవ్వమని ఎగజిమ్మింది రక్తం.

నిజమైన రక్తం చిక్కని రక్తం.

రుచిమాస్తే ఉప్పని రక్తం, ఉడుకు రక్తం.

వెన్నెల కాంతిలో నల్లగా మెరుస్తూంది.

మదపుటేనుగు మల్లె మొగ్గని మట్టేస్తూంది.

''బాబూ ఒగ్గేండి బాబూ!'' ఆ గొంతు మారీదుదో? బంగారానిదో, లేక ఇద్దరిదో.

''పట్టుకొగ్గేడానికి ఇది పాముకప్పాట అనుకున్నావేటి?''

ఆ కంఠస్వరం వీరాస్వామిదో? మస్తానుదో?

ముద్ద మందారం లాంటి బంగారం కళ్లలోంచి రాలే నిప్పుకణికల్లాంటి కన్నీళ్ళు వీరాస్వామిని అదిలించలేదు.

కాని, వీరాస్వామి కళ్లలో ఎరుపు జీరలు తగ్గుతున్న కొద్దీ, మస్తాను కళ్లలో ఎరుపు జీరలు ఎక్కువవుతున్నాయి.

ఊహించడానికి వీలులేని ఆ దృశ్యానికి, *అంతు చిక్కని ఆకాశం నీడ నిస్తూంది.*

ఆకాశం మీద చంద్రుడు ఆ దృశ్యం చూడలేక మేఘాలలోకి ముఖం తప్పించలేదు. కోర్టులో అప్రూవర్‌లా ధైర్యంగా చూస్తున్నాడు.

అప్పటివరకూ ప్రశాంతంగా ఉన్న మేఘాలు, హఠాత్తుగా గుమిగూడి గర్జించి, వాళ్లని ముంచెత్తేటట్లు వర్షించలేదు.

*బంగారమ్మ బ్రతుకు బుగ్గిపాలయి* పోతూనే ఉంది. అలా అని సినిమాల్లోలా నేపథ్యగానం వినిపించటం లేదు.

ఉన్నతంగా ఉన్న చెట్లు, సిగ్గుతో తల వంచుకోలేదు.

గాలి పాడుతున్న జోలకి, చెట్ల కొమ్మలు తల యూపుతూనే ఉన్నాయి, సాక్షుల్లా.

మొత్తంమీద, ప్రకృతి కాంత, మల్లె తొడుగు కొంచెమైనా నలగ లేదు.

వెన్నెల. వెన్నెల.

అంతా వెన్నెల. ★

70

# మార్గదర్శకులు



## ఇంగ్లండు, ఆస్ట్రేలియాల మధ్య విమానయానం

ఇంగ్లండు, ఆస్ట్రేలియాల మధ్య మొదటి పర్యాయం విమానంలో రాకపోకలు సాగించిన ఘనత ఇంగ్లీషు వైమానికుడు అలెన్ కాబ్‌హామ్‌కు లభించింది. అతడి వయసు అప్పట్లో 32 సంవత్సరాలు. కాబ్‌హామ్ 1926 జూన్ 30 వ తేదిని కెంట్‌లోని రోచెస్టర్ నుంచి ఒక్క ఇంజన్ కలిగిన 'బైప్లేన్'లో తన స్నేహితుడు, ఇంజనీరు అయిన ఎ. బి. ఇలియట్‌తో బయలు దేరాడు.

నాలుగు రోజుల తరవాత వారు బాగ్దాద్ చేరారు. అయిదవ రోజున వారు మృత్యువును ఎదుర్కోనవలసి వచ్చింది. విమానం టైగ్రిస్ లోయమీద పోతూ ఉండగా ఒక అరబ్ దానిమీద తుపాకి కాల్చాడు. గుండు దెబ్బకు ఇలియట్ చేయి విరిగింది. అంతటితో సరిపెట్టక తుపాకి గుండు ఇలియట్ ఊపిరి తిత్తులలో లోతుగా దిగింది. మిత్రుడు గాయపడి ముందుకు ఒరగడం గమనించాడు కాబ్‌హామ్. అమితమైన వేగంతో బాస్రా చేరాడు. కాని కొంది గంటలలో ఇలియట్ మృతి చెందాడు.

జూలై 13 న కాబ్‌హామ్ తిరిగి పయనం ప్రారంభించాడు. ఈసారి ఇలియట్ స్థానంలో బ్రిటిష్ విమాన బలానికి చెందిన సార్జెంట్ వార్డ్‌ను తనతో తీసుకొని వెళ్ళాడు కాబ్‌హామ్. విమానం ఆగస్టు 5 న డార్విన్ (ఆస్ట్రేలియా) చేరింది.

ఆగస్టు 29 న తిరుగు ప్రయాణం ప్రారంభమైంది. తుఫాను మూలంగా కాబ్‌హామ్ మలాయాలో దిగవలసి వచ్చింది. రంగూన్‌లో కూడా కొంత ఆలస్యమైంది. అయితే 320 గంటలసేపు 28 వేల మైళ్ళ దూరంలో గాలిలో గడిపిన తరవాత కాబ్‌హామ్ తిరిగి ఇంగ్లండు సురక్షితంగా చేరుకున్నాడు.